సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-మామిడికుదురు

మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిఎంఓ వెంకటేశ్వరరావు సూచించారు. లూటుకుర్రు పిహెచ్‌సి పరిధిలో కరవాక లో డ్రైడే –డ్రైడే కార్యక్రమంలో భాగంగా డిఎంఓ నక్కా వెంకటేశ్వరరావు, రాజోలు సబ్ యూనిట్ ఆఫీసర్ వై. ఆదినారాయణ విజిట్ చేసి సీజనల్ వ్యాధుల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫ్రైడే డ్రైడే కార్యక్రమం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసచార్యులు, ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి, ఆశాలు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న డిఎంఓ

సాగునీటి కొరత లేకుండా చర్యలు

- కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్
- పలు అంశాలపై అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి - అమలాపురం

జలవనరులు డ్రెయినేజీ, రెవెన్యూ, వ్యవసాయ శాఖలు సమన్వ యంతో రబి సీజన్లో సాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థాని కలెక్టరేట్ నందు ఇరిగేషన్ సలహా మండలిలో తీసుకున్న అజెండా అంశాలు, సాగునీరు సరఫరా, ఖరీఫ్ ధాన్యం సేకరణ, ఆక్వా రిజిస్ట్రేషన్లపై అధికారులతో సమీక్షించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో డెల్టా ప్రాంతంలో సాగునీటి అవస రాలను దృష్టిలో ఉంచు కొని ప్రధాన కాలువల ద్వారా ముందుగా వారా బంది విధానంలో చిట్ట చివరి ఆయకట్టు నుండి సాగు నీరు సరఫరా చేయా లని ఆదేశించారు. చివరి ప్రాంతాలకు నీరు చేరక పోవడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉండకూడదన్నారు ఈ సమస్యను నివారించేందుకు వంట కాలువలు, డ్రెయినేజీలు, చిన్న పంప కాలువలపై(క్రాస్ బండ్లు) తాత్కాలిక అడ్డాలు వేసి, ఆయిల్ ఇంజిన్‌ల సహకారంతో వరస క్రమం లో వారాబంది పద్ధతిలో నీటిని పంపిణీ చేసి రబీ సీజన్ను గట్టి ఎక్కించాలన్నారు. మండలాల వారీగా గతంలో ఎదుర్కొన్న నీటి ఎద్దడి సమస్యలను ప్రస్తావించి అవే సమస్యలు పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలు గురించి అధికారులకు వివరించారు. ప్రధాన పంట కాలువల చివరి ప్రాంతాలు, పంట కాలువలు, డ్రెయినేజీ నీటి ప్రవాహ స్థాయి లను పరిగణనలో తీసుకోవాలని అన్నారు. అవసరమైతే పంట పొట్ట దశ, పాలు పోసుకునే దశలో నీటి ప్రవాహాన్ని పెంచుతూ సీజన్ ఆద్యంతం కాపాడాలని ఆదేశించారు.నీటి ప్రవాహం తగ్గిన ప్రాంతాల్లో క్రాస్ బండ్లను ఏర్పాటు చేసి నీటిని నిల్వ చేసి ఆయిల్ ఇంజిన్ పంపుల సహకా రంతో నీటిని అవసరమైన భూములకు మళ్ళించాలన్నారు. వారా బంది విధానాన్ని అమలు చేసి, ప్రతి రైతుకు సమానంగా నీటి వినియోగం అందేలా సమన్వయం. వహించాలన్నారు. స్థానిక నీటి వినియోగదారుల సంఘాలు జల వనరుల వ్యవసాయ శాఖల మధ్య సమన్వయం పెంపొందిస్తూ మండల స్థాయిలో వారానికి ఒకసారి డివిజన్ స్థాయిలో పక్షం రోజులకు ఒకసారి సాగు నీటి సరఫరా అంశాలపై సమీక్షించి ఎక్కడ నీటి ఎద్దడి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు. కాలువ చివరి ఆయకట్టు వరకు నీరు పారించాలన్నారు సాగునీటి వృథా తగ్గించి అందుబాటులో ఉన్న నీటిని సమర్ధవంతం గా వినియోగిస్తూ నీటి వినియోగాన్ని గరిష్టతరం చేయాలన్నారు రైతుల్లో నమ్మకం పెంచాలన్నారు. గతంలోగమనించిన సవాళ్ళ ఎదుర్కొనేందుకు అంచనాల నివేదికలను రూపొం దించి డిసెంబర్ 2వ తేదీ నాటికి సమర్పిస్తే ఉన్నతా ధికారుల ద్వారా నిధులు రాబట్టేందుకు కృషి చేస్తామన్నారు .కొన్ని ప్రాంతాల్లో క్రాస్ బండ్లు బలహీనంగా ఉండడం వల్ల పునః మరమ్మతుల అవసరమని అధికారులు సూచించారు. అధికారుల మధ్య సమన్వయం లోపాలకు తావు లేకుండా వ్యవహరించాలన్నారు. కాలువల పూడిక కారణంగా నీటి ప్రవాహం మందగించడం జరుగుతుందన్నారు. కాలువల పూడిక పనులను రబీ సీజన్‌కు ముందుగా పూర్తి చేయాలన్నారు. అవసర మైన చోట్ల విజిలెన్స్ టీమ్‌లను నీటి వినియో గదారుల సంఘాలతో కలిపి నీటి సరఫరా క్రమబద్ధీకరణకు నియమించాలన్నారు. నీటి స్థాయిని పర్యవేక్షించే రియల్ టైమ్ మానిటరింగ్ విధానాన్ని అనుసరించాలన్నారు. డెల్టా ప్రాంతంలో రబీ సీజన్‌లో సాగు నీటి కొరతను అధిగమించేం దుకు క్రాస్ బండ్లు, ఆయిల్ ఇంజిన్ పంపులు వారాబందీ విధానం అనుసరించడం ద్వారా మంచి ఫలితాలు రాబట్టాలన్నారు. జిల్లాలో ధాన్యం సేకరణకు మూడు లక్షల 50 వేలు మెట్రిక్ టన్నులు లక్ష్యంగా నిర్దేశించారని ఆ దిశగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరించాలని సూచించారు డిసెంబరు 2వ తేదీ వరకు తుపాను నేపథ్యంలో రైతులు వరి కోతలు నిలుపుదల చేయాలన్నారు. రైతులకు అవసరమైన గోనె సంచులు, టార్పాలిన్లు సరఫరా చేస్తామన్నారు. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 1,20,000 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని సేకరించినట్లు తెలిపారు ఆక్వా చెరువుల రిజిస్ట్రేషన్ పై సమీక్షిస్తూ జిల్లా వ్యాప్తంగా 47,380 ఎకరాల విస్తీర్ణంలో ఆక్వా చెరువులు ఉన్నాయని వీటిలో 10వేలు ఎకరాలలోని చెరువులకు రిజిస్ట్రేషన్ చేశారన్నారు. 17 వేల ఎకరాలు వివిధ కారణాల మూలంగా నమోదు కు ఆస్కారం లేదని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మరో 19వేల ఎక రాలలో చెరువుల రిజిస్ట్రేషన్ కు గ్రామాల వారీగా లక్ష్యాలు నిర్దేశించి 15 రోజులలో నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెసి టి.నిశాంతి, డిఆర్ఓ కె.మాధవి జల వనరుల శాఖ ఎస్ఐ టి. గోపీనాథ్, జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

అన్నదాతల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

అంబాజీపేట: రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ముక్కామలలో రైతు సేవా కేంద్రం వద్ద నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ ప్రకృతి సేంద్రియ, వ్యవసాయ విధానాల పట్ల మక్కువ పెంచుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. ధాన్యం కొనుగోలు సేవలను రైతులు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని అన్నారు. రబీ యూరియా అంచనాలను కూడా ఇప్పటి నుంచే గత సీజన్ వినియోగాన్ని, అంచనా వేయాలని అన్నారు పెరిగిన పంటల విస్తీర్ణతను దృష్టిలో ఉంచుకొని గ్రామం, మండలం వారిగా యూరియా ఎంత అవసరమో అంచనాలు రూపొందించాలని అన్నారు. రైతులకు అధిక ఆదాయాలు లభించేలా పంటల వైవిధ్యతను ప్రోత్సహించి అవగాహన పెంపొందించాలన్నారు. డిసెంబర్ 3న రైతు సేవా కేంద్రాల పరిధిలో వర్క్ షాపులు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, ముక్కామల, సర్పంచ్ బండారు వెంకటలక్ష్మీ, సొసైటీ ఛైర్‌పర్సన్ కుడిపూడి రాంబాబు, దువ్వూరి సురేష్, వ్యసాయ సిబ్బంది, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు

ఎస్‌పి రాహుల్ మీనా

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు ఎస్‌పి రాహుల్ మీనా తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించి కేసుల వివరాలను రికార్డులను తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. స్థానిక ఎస్‌ఐ, సిహెచ్.రాజేష్, పోలీసు సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌పి రాహుల్ మీనా మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం, ఈవ్ టీజింగ్ వంటి వాటిపై ఎల్లవేళలా నిఘా ఉంచి విద్యాసంస్థల్లో వాటి వల్ల కలిగే నష్టాలపై అవగాహనా సదస్సులు నిర్వహించి విద్యార్థుల్లో చైతన్యం తీసుకువస్తున్నామని అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. హెల్మెట్‌ల విని యోగంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎవరికి అన్యాయం జరిగిన నిర్భయంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసి న్యాయం పొందాలని ఎస్‌పి కోరారు. ఆయన వెంట డిఎస్‌పి టిఎస్‌ఆర్‌కె.ప్రసాద్, సిఐ డి.ప్రశాంత్ కుమార్ ఉన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌పి రాహుల్ మీనా

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు అన్నారు. ఆత్రేయపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బారుకు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున ప్రజలు హాజరయ్యారు. ప్రజలు తమ సమస్యలు, వినతులను ఎంఎల్‌ఎకు సమర్పించారు. ఆయన వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి అనేక సమస్యలను అక్కడి కక్కడే పరిష్కరించారు. మొత్తం 311 వినతులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను సమయానుకూలంగా పరిష్క రించేం దుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ టి.రాజేశ్వరరావు, ఎంపిడిఒ బికె ఎస్‌ఎస్.వెంకట రమణ, అధికారులు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎంఎల్‌ఎ బండారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - రామచంద్రపురం

స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కెవిలో మెయింటెనెన్స్, మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు శుక్రవారం రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాల రావు తెలిపారు. ద్రాక్షారామం, హసన్‌బాద, కందులపాలెం ఉండూరు, భీమ కోసుపాలెం, తాడే పల్లి, కాపవరం, వెల్ల సావరం, వెల్ల, ఏరుపల్లి, తాళ్లపాలెం, ఉట్రిమిల్లి, జగన్ నాయ కులపాలెం, వేలంపాలం, నేలపర్తిపాడు, వేగా యమ్మపేట, అన్నాయిపేట, వెంకటాయపాలెం, తోటపేట గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యా హ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

ముమ్మిడివరంలో క్యాండిల్ ర్యాలీ

బాల్య వివాహ చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - ముమ్మిడివరం

బాల్య వివాహ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలా సాగర్ పేర్కొన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్, అలర్ట్ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహల వల్ల కలిగే అనర్థాలపై వివరిస్తూ కాశి వాని తూము సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ సెంటర్ వరకు క్యాండిల్ ఈ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఎస్ ఐ జ్వాలా సాగర్ ప్రారంభించారు. ఎస్ఐ మాట్లాడుతూ మహిళలు విద్యావంతులైనప్పుడే సమాజం లో అణచివేత, వివక్షలను పారద్రోల వచ్చునన్నారు. బాల్య వివాహాలు, వెట్టి చాకిరీ, బాల కార్మిక నిర్మూలనకు చట్టాలు ఉన్నాయని వాటిపై అవగహన కల్పించడం ద్వారా ఈ వివక్షలను అధిగమించవచ్చునన్నారు. అలర్ట్ జిల్లా కో ఆర్డినేటర్ కన్నిడి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ బాల్య వివాహాలను నియంత్రించడంలో భాగంగా తమ సంస్థ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా చేపట్టిన కొవ్వొత్తుల ర్యాలీకి విశేషా స్పందన వచ్చిందన్నారు. అనంతరం బాల్య వివాహాలను అరికడద్దాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్ర మంలో అంగన్‌వాడీలు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



దర్శకుడు గీతాకృష్ణ వ్యాఖ్యలపై నిరసన

- అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత ప్రజా సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - అమలాపురం

సినీ దర్శకుడు ఎఎస్.గీతాకృష్ణ రిజర్వేషన్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై దళిత ప్రజా సంఘాల నాయకుల నిరసన తెలిపారు. అమలాపురం గడియార స్తంభం సెంటర్ వద్ద దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయనపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా దళిత ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికగా ఒక యూట్యూబ్ ఇంటర్వ్యూలో గీతాకృష్ణ ఎస్‌సి, ఎస్‌టిలు అడుక్కుతినే స్థితిలో ఉన్నందునే రిజర్వేషన్లు కల్పించారని, ఆ రిజర్వేషన్ల ఆధారంగానే ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు పొందుతున్నారని కించపరిచే విధంగా మాట్లాడారన్నారు. గీతాకృష్ణ వ్యాఖ్యలు సమాజంలో కులాల మధ్య విద్వేషాలు పెంచి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రమాదం ఉందని దళిత సంఘాల నాయకులు హెచ్చరించారు. నిరసన అనంతరం దళిత ప్రజా సంఘాల నాయకులు టౌన్ పోలీస్ స్టేషన్‌లో గీతాకృష్ణపై లిఖితపూర్వక ఫిర్యాదు దాఖలు చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరావు, రేవు తిరుపతి రావు, పొలామూరి మోహన్, శెట్టిబత్తుల తులసిరావు, జి.దైవకృప, పి.అమూల్య, పెయ్యాల దుర్గా ప్రసాద్, మెండి డేవిడ్, వాకాపల్లి హరీష్, తాడి రాంబాబు, కడలి వెంకట సుబ్రహ్మణ్యం, జిత్తుక సత్యనారాయణ, కొనాల ప్రకాష్, గెద్దడ బుద్ధరాజు, సాపే రమేష్, బూసి రాంబాబు, గిడ్ల వెంకటేశ్వరరావు, ముత్తబత్తుల శ్రీను, దళిత ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడియార స్తంభం సెంటర్లో నిరసన తెలుపుతున్న నాయకులు

ఆత్మ కమిటీతో రైతులకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి - కొత్తపేట

ఆత్మ కమిటీ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని ఛైర్మన్ జక్కంపూడి సీతారామకృష్ణ బాలాజీ అన్నారు. ఎఫ్‌పిఒఎస్ స్థాపించి రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పరిచి ప్రత్యక్షంగా వారే అమ్ముకునేటట్లుగా తన వంతు కృషి చేస్తానని ఆయన తెలియజేశారు. కొత్తపేట సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో ఆత్మ బ్లాకు రైతు సలహా కమిటీ ఛైర్మన్, సభ్యులు పదవీ బాధ్యతల స్వీకరించారు. శుక్రవారం కార్యక్రమం ఎడిఎ రామారావు అధ్యక్షత జరిగింది. కార్యక్రమంలో సీతారామకృష్ణ బాలాజీ ఛైర్మన్‌గా, మిగిలిన 30 మంది ఆత్మ మెంబర్లుగా పదవీ బాధ్యతలు స్వీకరణ జరిగింది. ఎడిఎ మాట్లాడుతూ ఆత్మ ప్రాజెక్టు ద్వారా ప్రదర్శన క్షేత్రాలు, శిక్షణ కార్యక్రమాలు, విజ్ఞాన యాత్రలు, పొలంబడిల ద్వారా నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు కె.ద్వారకా దేవి, ఎస్.లక్ష్మీ లావణ్య , జె.పట్టాభిరామయ్య ఆత్మ ఎటిఎం ఎం.నాగేశ్వర రావు, జక్కంపూడి వెంకటస్వామి, చిలువూరు సతీష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సీతారామకృష్ణబాలాజీ, సభ్యులు

జ్యోతీరావ్ పూలేకు ఘన నివాళి

ముమ్మిడివరంలో పూలే చిత్రపటం వద్ద నాయకుల నివాళి

ప్రజాశక్తి - యంత్రాంగం

మహాత్మ జ్యోతిరావ్ పూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు నాయకులు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముమ్మిడివరం: సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, వారి విద్యాభివృద్ధికి కృషి చేసిన సామాజిక విప్లవకారుడు జ్యోతిరావ్ పూలే అని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకుడు పాము బాలయ్య, రిటైర్డ్ రైల్వే ఉద్యోగి గిడ్డి ప్రభాకర రెడ్డి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బళ్ళగేటు సెంటర్ లోని సిఐటియు కార్యాలయం నందు ప్రజాసంఘాల అధ్వర్యంలో జ్యోతిరావ్ పూలే వర్ధంతి నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బాలయ్య, ప్రభాకరరెడ్డి తొలుత మహాత్మ పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పిం చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకుడు యలమంచిలి బాలరాజు, సిఐటియు నాయకుడు నిమ్మకాయల వెంకటేష్, దుక్కిపాటి సూర్య నారాయణ, కాకి రాంబాబు, పలివెల ఆనంద్, సతీష్, బాలకష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎపి షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం(ఎస్–16) మండల శాఖ అధ్యక్షుడు మట్టా శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ కన్వెన్షన్ హాలు నందు పూలే వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కాశి బాబు జగజీవన్ రావు, కాశి వెంకటాచార్య, నేరేడుమిల్లి అబ్బులు, జనిపల్లి సత్యనారాయణ, బాలకృష్ణ, పి.డెనియల్ తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు:** జ్యోతిరావు పూలేను ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలని బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గుబ్బల మురళీకృష్ణ అన్నారు. మామిడికుదురు బాలుర వసతి గృహం వద్ద, అప్పనపల్లిలో కంకిపాటి సూర్యారావు ఆదిలక్ష్మి మెమోరియల్ ఫౌండేషన్ కళావేదిక ప్రాంగణంలో పూలే విగ్రహానికి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం మండల శాఖ అధ్య క్షులు నైనాల రఘురామయ్య, ప్రధాన కార్యదర్శి గెద్దాడ శ్రీనివాస్, బొక్కా వెంకటేశ్వరరావు, రాయుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **మండపేట:** పేదల ఆశాజ్యోతి జ్యోతిరావ్ పూలే అని రాష్ట్ర సబ్ ఆర్డినేటర్ కమిటీ ఛైర్మన్, నియోజక వర్గ వైసిపి ఇన్‌ఛార్జి ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. మండపేటలో జ్యోతిరావ్ పూలే వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి కన్వీనర్ పిల్లి శ్రీనివాస్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, కో ఆప్షన్స్ సభ్యులు రెడ్డి రాధాకష్ణ, రాష్ట్ర వైసిపి బీసీ సెల్ కన్వీనర్ యాండ్ర బుజ్జి, మున్సిపల్ కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం:** ద్రాక్షారామం మసీదు సెంటర్‌లో ఉన్న పూలే దంపతులు విగ్రహాలకు ఎంబిసి సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కొండేపూడి నవీన్ కుమార్, ఎండి ఆలీఖాన్, గారోజు సూరిబాబు, బిల్లకుర్తి స్వామి, మేడిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. జ్యోతిరావ్ పూలే వర్ధంతి రామచంద్రపురంలోని ఉమ్మడి టిడిపి పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** జ్యోతిరావు పూలే విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బిసి నాయకులు విత్తనాలు సత్యనారాయణ, గుత్తుల నాగేశ్వరరావు, రాయుడు సత్యనారాయణ, చప్పిడి వెంకట నాగేశ్వరరావు,కడలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మండపేటలో నివాళులర్పిస్తున్న ఎంఎల్‌సి తోట తదితరులు

ఐదేళ్లలో రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు

- బోడసకుర్రు గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి

ప్రజాశక్తి - అల్లవరం

బోడసకుర్రు గ్రామపంచాయతీ పరిధిలో గడచిన ఐదేళ్ల కాలంలో వివిధ విభాగాలకు సంబంధించి సుమారు రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఆ గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.80 లక్షలతో రెండు సచివాలయలు, రూ.45.74 లక్షలతో రెండు రైతు భరోసా కేంద్రాలు, రూ.17.50 లక్షలతో రెండు హెల్త్ సెంటర్లు, రూ.10 లక్షలతో కమ్యూనిటీహాల్, రూ.72.75 లక్షలతో 17 సిసి రోడ్లు, రూ.53.42 లక్షలతో 18 గ్రావెల్ రోడ్లు, రూ.17.50 లక్షలతో ఐదు సిసి డ్రెయినేజీలు, రూ.23.10 లక్షలతో 11 పాంచాల నిర్మాణం, మరమ్మతులు, రూ.83 లక్షలతో రెండు ఒహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు, రూ.17 లక్షలతో రెండు కల్వర్ట్‌ల నిర్మాణం, రూ.8 లక్షలతో ఒ హెచ్ ఎస్‌ఆర్ ట్యాంక్ కొత్త పైప్‌లైన్, పాత పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టామని అన్నారు. ఈ అభివృద్ధి పనులను వివిధ భాగాలకు సంబంధించి 15వ ఆర్థికసంఘం, ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్, ఎంపి ల్యాడ్స్, సిఎస్‌ఆర్, జెజెమ్ నిధులతో చేపట్టామన్నారు. వీటితో పాటు జెడ్‌పిటిసి నిధులతో ఎస్‌సి శ్మశానవాటికకు గ్రావెల్ రోడ్డు నిర్మించామని అన్నారు. ఒఎన్‌జిసి సిఎస్‌ఆర్ నిధులతో మంచినీటి సమస్య పరిష్కారం కోసం రూ.13 లక్షలతో ట్రాక్టరు, 4 వేల లీటర్ల వాటర్ ట్యాంకర్ , గ్రామంలో వంద మందికి శిక్షణ అనంతరం 100 కుట్టు మిషన్లు, 25 మందికి బ్యూటీషన్‌లో శిక్షణ ఇచ్చి బ్యూటీషన్ కిట్లు అందజేశామన్నారు. 700 మందికి కంటి పరీక్షలు నిర్వహించి నాలుగు వందల మందికి కళ్లజోళ్ళు ముప్పై మందికి కంటి ఆపరేషన్ నిర్వహించామన్నారు. బోడసకుర్రు దేవి సెంటర్ నుంచి ఒఎన్‌జిసి టెర్మినల్ వరకూ రూ.57లక్షలతో బిటి రోడ్డు నిర్మాణం పూర్తయ్యిందన్నారు. గ్రామంలో వివిధ స్వచ్ఛంద సంస్థల ద్వారా గ్రామ ప్రజలకు మెడికల్ హెల్త్ క్యాంప్‌లు, కుట్టు మిషన్ శిక్షణ, వివిధ సమస్యలపై ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ ఎప్పటి కప్పుడు గ్రామాల్లో శానిటేషన్ నిర్వహిస్తున్నామని అన్నారు. వరద ప్రభావిత ప్రాంతంలో రక్షణ చర్యలతో పాటు ప్రత్యేక శానిటేషన్ పనులు నిర్వహించామన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రభుత్వం, వివిధ స్వచ్ఛంద సంస్థల ద్వారా బాధితులకు నిత్యావసరాలు, ఆర్థిక సహాయం అందేలా చేసి బాధితులకు అండగా నిలిచామని సర్పంచ్ అన్నారు. గ్రామంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి శ్మశానవాటికలకు స్థలాలు సమస్య, ఉన్న శ్మశాన వాటికలకు రహదారి సమస్యలు, గ్రామంలో డ్రెయినేజీ సమస్యలు ఉన్నాయన్నారు. వీటి పరిష్కారం కోసం కలెక్టర్, ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకువెళ్లామని అన్నారు. గ్రామ అభివృద్ధిలో సహాయ సహకారాలు అందించిన ప్రజాప్రతినిధులకు, నాయకులకు, అధికారులకు, గ్రామ పెద్దలకు ఈ సందర్భంగా బోడసుకుర్రు గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి కతజ్ఞతలు తెలియజేశారు.

రొక్కాల విజయలక్ష్మి, సర్పంచ్

ప్రేరణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి - అమలాపురం

టెన్త్ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచి పబ్లిక్ పరీక్షలకు సమగ్రమైన సిద్ధత కల్పించడం, భవిష్యత్తు లక్ష్యాలపై స్పష్టత ఇవ్వడం కోసం ప్రేరణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. ఆయా అంశాలు ఆచరిస్తూ జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. శుక్రవారం టెన్త్ విద్యార్థులకు విద్యా ప్రార్ధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒత్తిడిని తగ్గించుకొని చదువుల పట్ల ఆసక్తిని చూపు తూ శాంతి యుతంగా విద్యను అభ్యసించి ఉత్తమ ఫలితాలు చేజిక్కించుకోవాలన్నారు ప్రత్యేక ప్రేరణ తరగతులు మూలంగా పరీక్షా భయం తగ్గించు కొని ఉత్తమ మార్కులు సాధించాలన్నారు. కెరీర్ గైడెన్స్ వంటి అంశాలు ద్వారా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలన్నారు. విద్యా ర్థుల విద్యా ప్రగతి కోసం ప్రేరణ, స్ఫూర్తి నింపే కార్య క్రమాలు. రోజువారీగా ఉదయం, సాయంత్రం ఒత్తిడిని తగ్గిం చుకునేందుకు ఐదు నిమిషాల పాటు యోగాను రాత్రిపూట ప్రత్యేక తరగతులను వంద రోజులు ప్రణాళికలతో సమగ్ర అవగాహనను కల్పించాలన్నారు. విద్యార్థులు ఈ ప్రేరణ ద్వారా కెరీర్ అవగాహన భవిష్యత్ ప్లానింగ్ చేసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో డిఇఒ షేక్ సలీం బాషా, డిసిబి హనుమంతరావు, ఘన సత్యనారాయణ, రామకృష్ణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - అయినవిల్లి

స్వచ్ఛాంధ్ర సాధనకు అందరూ కృషి చేద్దామని ఎంపిడిఒ జి.సరోవర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ప్రకారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అయినవిల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అయిన పచ్చదనం–పరిశుభ్రతపై డిఆర్‌డిఎ, విఒలకు, గ్రామ సంఘాల సభ్యులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఎంపిపి మట్టపర్తి నాగ విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ వాణి కుమారి బెహరా, వెలుగు ఎపిఎం వెంకటేశ్వరరావు, మహిళా సమాఖ్య సభ్యులు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గంజాయి నిందితులతో పోలీసులు

131 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - నల్లజర్ల

బొలెరో వ్యాన్‌లో తరలిస్తున్న రూ. 65,73,500 విలువ చేసే 131.47 కేజీల గంజాయిని నల్లజర్ల పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గంజాయి రవాణాపై నల్లజర్ల ఎస్ఐకు ముందస్తు సమాచారం వచ్చింది. ఈ మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టారు. తాడేపల్లిగూడెం నుంచి నల్లజర్ల గ్రామం వైపు వస్తున్న బొలెరో వ్యాన్‌లో ఆరు ప్లాస్టిక్ సంచులను గుర్తించారు. తనిఖీ చేయగా ఇందులో గంజాయి ఉన్నట్టు గుర్తించారు. సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం మంగాలపల్లి పంచాయతీ పరిధిలోని మారేటిపల్లికి చెందిన డ్రైవర్ తలారి ఆనంద్, మరో వ్యక్తి పూల మనోహర్‌ను అరెస్టు చేశారు. వారిని విచారణ చేయగా కేడి పేట అవతల ఉన్న కాకరపాడు ఏజెన్సీ ఏరియా నుంచి తీసుకొస్తున్నట్ట తెలిపారన్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేశామన్నారు. నిందితుడు పూల మనోహర్‌పై గతంలో ఐదు గంజాయి అక్రమ రవాణాకి సంబంధించిన కేసులు ఉన్నాయన్నారు. నిందితులను పట్టుకోవడంలో నైపుణ్యాన్ని ప్రదర్శించిన కొవ్వూరు డిఎస్‌పి జి.దేవకుమార్, నల్లజర్ల సిఐ వై.రాంబాబు, ఎస్ఐ కె.దుర్గాప్రసాద్, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

తగాదాలో వ్యక్తి ఆకస్మిక మృతి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

రెండు కుటుంబాల మధ్య ఘర్షణలో ఒక వ్యక్తి హఠాత్తుగా కిందపడి మృతి చెందిన సంఘటన శుక్రవారం తాటిపర్తిలో చోటు చేసుకుంది. బంగారుపేటలో శ్రీమంతుడు కుమార్తె పుట్టినరోజు ఏర్పాట్లకు ఇంటి పక్కన రహదారి మీద పొయ్యి పెట్టి ఎవరో ఆ మార్గం గుండా వెళ్ళకుండా అడ్డుగా బల్లపెట్టారు. ఆ ఇంటి వెనుక వైపు నివాసం ఉంటున్న వేంపాల సూరిబాబు (55) కుటుంబ సభ్యులు దీనిపై తగాదా పడ్డారు. అకస్మాత్తుగా సూరిబాబు కింద పడిపోయాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా వైద్యులు చనిపోయినట్లు నిర్ధారించారు. ఆయనకు ముగ్గురు పిల్లలు భార్య ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

వాటర్ ప్లాంట్‌లో మోటార్ల చోరీ

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని చెందుర్తిలో ఫిల్టర్ వాటర్ ప్లాంట్‌లో నేచురల్ ఆయిల్ కంపెనీ వారు ఏర్పాటు చేసిన మోటార్లు చోరీకి గురయ్యాయి. దీంతో గ్రామంలో వాటర్‌కు ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉందని, దీనిపై పంచాయితీ కార్యదర్శి గంగాధర్ చోరీకి పాల్పడిన వారిని గుర్తించి శరీర తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణ శివారులోని బహిరంగ ప్రదేశంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గొల్లప్రోలు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని పోలీసులు అదుపులో తీసుకుని వారి వద్ద రూ.4,020 నగదును స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - సీతానగరం

యువతి అదృశ్యంపై శుక్రవారం సీతానగరం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలో పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన యువతి తల్లి ఉప్పలపాటి అరుణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు వివరాలు ఇలా ఉన్నాయి. ఆమె కుమార్తె డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుందన్నారు. ఏటుగట్టు రహదారి నిర్మాణం కారణంగా బస్సులు నడవక పోవడంతో రఘుదేవపురంలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటుందన్నారు. అక్కడి నుంచే కళాశాలకు వెళ్తుందన్నారు. ఈ నెల 26న రఘుదేవపురంలో అమ్మమ్మ ఇంటి నుంచి రాజమహేంద్రవరంలో కళాశాలకు వెళ్లిందన్నారు. తిరిగి ఇంటికి రాలేదన్నారు. బంధువులు, స్నేహితులను వాకబు చేయగా ఏటువంటి ఆచూకీ లభించలేదన్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. సీతానగరం ఎస్ఐ రామ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి ఆచూకీ గుర్తింపు

ప్రజాశక్తి - కరప

అదృశ్యమైన కరప బిసి గురుకుల పాఠశాల విద్యార్థి పుల్లేటిగుర్తి చరణ్‌తేజ(11) ఆచూకీని పోలీసులు గుర్తించారు. విశాఖ జిల్లా పెదవాల్తేరుకు చెందిన చరణ్‌తేజ కరప బిసి గురుకుల హాస్టల్లో 6వ తరగతి చదువుతున్నాడు. అతని తల్లితండ్రులు ఈ నెల 27న మధ్యాహ్నం 12.30కి హాస్టల్లో అప్పగించి వెళ్లి పోయారు. అదేరోజు రాత్రి 7గంటల నుంచి బాలుడు అదృశ్యమయ్యాడని ప్రిన్సిపల్ రామకృష్ణ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ టి సునీత కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా చరణ్ తేజ విశాఖలోని తన పెద్దమ్మ ఇంటి వద్ద ఉన్నట్లు తన తల్లికి ఫోన్ చేసి తెలిపాడు. ఈ విషయాన్ని విద్యార్థిని తల్లి ప్రిన్సిపల్‌కు, పోలీసులకు తెలియపరిచారు. తన పెద్దమ్మతో ఉన్న ఫోటోను వాట్సప్ ద్వారా పంపించారు. ఈ నేపథ్యంలో హాస్టల్ సిబ్బంది, తోటి విద్యార్థులు అందరూ ఆనందం వ్యక్తం చేశారు.

రైతన్నా మీకోసంపై అవగాహన

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడలో రైతనా మీకోసం కార్యక్రమంలో భాగంగా సొసైటీ చైర్మన్ మేడపాటి రామారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల జీవనోపాధి, ఆర్థిక స్థితి, నైపుణ్యాభివృద్ధికి శాశ్వత మార్పు తీసుకురావడం లక్ష్యంగా రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు రేలంగి సత్యనారాయణ, యాళ్ల చంద్రశేఖర్, సిఇఒ ముత్యం రత్తయ్య, టిడిపి నేతలు తాడి శ్రీనివాస్ రెడ్డి, గొడవర్తి బాబి, రైతులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సహకారం అభినందనీయం

ప్రజాశక్తి - మండపేట

విద్యాభివద్ధికి రోటరీ క్లబ్ అందిస్తున్న సహకారం అభినందనీయమని పాఠశాల హెచ్‌ఎం వెంకటరాజు అన్నారు. శుక్రవారం మండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముంగర వెంకటరాజు అధ్యక్షతన మండపేట రోటరీ క్లబ్ సభ్యులు పాఠశాల వద్ద పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలమూరుకు చెందిన వంటిపల్లి పాపారావు సహకారంతో నాప్కిన్స్ డిస్ట్రాయ్ మిషన్‌ను పాఠశాలకు అందజేశారు. కెనడాలో ప్రముఖ గైనకాలజిస్ట్‌గా పని చేస్తున్న చంద్ర మౌళి కుమార్తె డాక్టర్ శారద పాఠశాలలో విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం రోటరీ క్లబ్ సభ్యులు ఉపాధ్యాయులకు ముప్పై కుర్చీలను, విద్యార్థినులకు స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం కౌమార బాలికల తీసుకోవాల్సిన జాగ్ర త్తలపై రచించిన పుస్తకాలను విద్యార్థినులకు అంద జేశారు. రోటరీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు బొబ్బా సత్య సాయి రామకృష్ణ, రోటరీ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు నల్లమిల్లి వెంకట కృష్ణారెడ్డి, యిమ్మిడిశెట్టి నాగ భూషణం, వెలగల శ్రీనివాస్ రెడ్డి, వంక ప్రసాద్, మల్లిడి శ్రీనివాసరెడ్డి, కొనగళ్ళ విశ్వనాథం, ఉపాధ్యాయులు కొండేటి సుష్మా, సునీత, సాయిరాం, మందపల్లి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు, పుస్తకాలు, కుర్చీలు అందజేసిన రోటరీ సభ్యులు

నిత్యాన్నదానానికి దాతల విరాళాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో నిత్యాన్నదానానికి దాతలు శుక్రవారం విరాళాలు అందజేశారు. దాతలకు స్వామి వార్ల చిత్రపటాలను అందజేశారు. **మామిడికుదురు :** యలమంచిలి మండలం శిరగాలపల్లికి చెందిన మద్దుల రమేష్, మనోహరి దంపతులు, వారి కుటుంబ సభ్యులు శుక్రవారం అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి వారిని దర్శించుకున్నారు.దాతలు స్వామివారి అన్న ప్రసాద ట్రస్ట్‌కు రూ.10,116 విరాళంగా సమర్పించారని ఆలయ సహాయ కమిషనర్ ఎం సత్యనారాయణ రాజు తెలిపారు తెలిపారు. వీరికి ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేసి, శ్రీ స్వామివారి చిత్రపటం అందజేశారు. **ఆత్రేయపురం:** వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చే యాత్రికులకు నిర్వహించే నిత్యాన్ననదానానికి శుక్రవారం ఏలూరు జిల్లా కలిదిండి మండలం కొండూరు గ్రామానికి చెందిన గోరిపతి నాగరాజు వెంకట నరసమ్మ దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.50,011 ఆలయ డిసి నల్లం సూర్యచక్రధర్‌రావుకు అందజేశారు. వీరికి స్వామివారి దర్శనం తీర్థ ప్రసాదాలతో పాటు స్వామివారి చిత్రపటం అందజేశారు. అలాగే ర్యాలీ జగన్మోహిని కేశవ, గోపాల స్వామి వార్ల ఆలయానికి వచ్చే యాత్రికులకు నిర్వహించే అన్నదానం కోసం హైదరాబాద్‌కు చెందిన పన్నాల విశ్వనాథ్ సుధాకర్ రూ.5,001 విరాళాన్ని ఆలయ ఇఒ అధికారి భాగవతుల వెంకటరమణమూర్తికి అందజేశారు. వీరికి ఆలయ మర్యాదలతో స్వామి వారి దర్శనం చేయించి అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు స్వామివారి శేష వస్త్రాన్ని అందజేశారు.

దాతకు స్వామివారి చిత్రపటం బహూకరిస్తున్న బాలబాలాజీ ఆలయ పర్యవేక్షకులు

బాధితులకు రూ.10 వేల సాయం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మర్లపాలెం గ్రామం అరుంధతిపేట నందు ఇటీవల అగ్నిప్రమాదం గురై రెండు తాటాకు ఇల్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో రెండు కుటుంబాల వారు నిరాశరులయ్యారు. శుక్రవారం రావులపాలెం కు చెందిన శ్రీ ఫ్రెండ్స్ సేవా సంస్థ తరపున సంస్థ నిర్వాహకులు ఈశ్వరరెడ్డి, తాడి సత్యనారాయణ రెడ్డి చేతుల మీదుగా రూ.10 వేలను బాధితులకు అందజేశారు

ఆర్థిక సాయం అందజేస్తున్న సేవా సంస్థ

పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

ప్రజాశక్తి - అంబాజీపేట

ప్రభుత్వ ఆదేశాల మేరకు బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలో ఉండేలా చర్యలు తీసుకుంటు న్నామని తొండవరం హైస్కూల్ హెచ్‌ఎం ఎంటివి.కేశవాచార్యులు తెలిపారు. సహ ఉపాధ్యాయులు కె.వెంకటేశ్వరరావుతో కలిసి వాకలగరువులో ఫిషర్ మెన్ పేట, బుల్లియ్య కాలనీ, రజకపేట ప్రాంతాలలో బడి ఈడు పిల్లల గురించి వివరాలు సేకరించారు. తరచూ డ్రాపౌట్ అవుతున్న పదవ తరగతి పిల్లల్ని పాఠశాలకు తిరిగి రప్పించడానికి శుక్రవారం ఇంటింటికి తిరిగి హైస్కూల్ కి తీసుకు వెళ్లే కార్యక్రమం చేపట్టారు. బడి మానేయకుండా ఇష్టపడి చదువుకుంటే భవిష్యత్తుకు బంగారు బాట వేయవచ్చని అన్నారు. బడి మానివేసిన విద్యార్థుల తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. బడి మాన్పించి వారి భవిష్యత్తును అంధకారం చేయొద్దని వివరించారు. పిల్లలను పాఠశాలలో కొనసాగించడానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బడికి వెళ్లని విద్యార్థి ఇంటికి వెళ్లి మాట్లాడుతున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ప్రకృతి సేద్యానికి ప్రభుత్వ ప్రోత్సాహం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వ్యవసాయాన్ని లాభదాయక రంగంగా మార్చడానికి ఆధునిక పద్ధతుల ద్వారా ప్రకృతి సేద్యాన్ని తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లు కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం ఆత్రేయపురంలో జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొని ఆయన .అన్నదాతలతో మాట్లాడారు. వ్యవసాయ అధికారులతో కలిసి రైతన్నా మీకోసం కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్‌ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు అనే అంశాలతో పంచ సూత్రాలతో అన్నదాతలకు అండగా నిలవడానికి రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అధిక లాభాలు వచ్చే పంటలను సాగుచేసి రైతులు ఆర్థికంగా పురోగతి చెందాలన్నారు. ప్రకృతి వ్యవసాయంపై మరింత అవగాహన పెంచుకుని ఆ దిశగా పంటలను సాగు చేస్తే మేలు చేకూరుతుందన్నారు.సేంద్రీయ వ్యవసాయంతో భూసార పరిరక్షణతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం కూడా లభిస్తుందని అన్నారు. వ్యవసాయాధికారులు సూచించిన విషయాలను జాగ్రత్తగా పాటించి వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటలు సాగు చేసుకోవాలన్నారు. పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవ పథకం కింద రెండు విడతల్లో పిఎం కిసాన్ పథకంతో కలిబీతీ ఇప్పటికే రూ.14వేలు అందించడం జరిగిందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించడంలో కూటమి ప్రభుత్వం ముందుందని తెలిపారు. అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు.కూటమి ప్రభుత్వంలో రైతు రాజుగా మార్చాలన్నదే సంకల్పంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదునూరి వెంకటరాజు, కాయల జగన్నాధం, జక్కంపూడి బాలాజీ, ముళ్ళపూడి భాస్కరరావు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కరపత్రాలపై ఉన్న పంచ సూత్రాలను రైతుకు వివరిస్తున్న ఎంఎల్ఎ బండారు

ఆలమూరులో విఒఎలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

క్లీన్ అండ్ గ్రీన్‌పై ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి - ఆలమూరు

మండలపరిషత్ కార్యాలయంలో శుభ్రత పరిశుభ్రత (క్లీన్ అండ్ గ్రీన్) పై శుక్రవారం ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్, వాటి విధివిధానాలకు సంబంధించి వివోఏలతో ప్రత్యేక ర్యాలీ చేసి, ప్రతిజ్ఞ చేయించారు. ఎంపిడిఒ రాజు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సేవలను గౌరవిస్తూ, ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి, గ్రామస్తులు సహాయ సహకారాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో పల్లెల్లో వాతావరణం క్లీన్ అండ్ గ్రీన్ తలపిస్తుందని ఆయన పేర్కొన్నారు. అందుకు ప్రతి గ్రామంలో డ్వాక్రా మహిళల ద్వారా శుభ్రత పరిశుభ్రత కోసం వారంతా ముందుకు వచ్చి ఇందులో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఒ మెహర్ ప్రకాష్, ఎపిఎం సత్తిబాబు, కార్యదర్శి అయ్యన్న, అకౌంటెంట్ కుమార్, విఒఎలు తదితరులు పాల్గొన్నారు. **అంబాజీపేట:** ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకి ప్రాధాన్యత ఇస్తే ఆరోగ్యవంతమైన సమాజంలో జీవించవచ్చని ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు సూచించారు. అంబాజీపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయం నందు శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ పై మహిళలకు ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో శుక్రవారం అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్త సేకరించి అందరూ చైతన్యవంతమై క్రాప్ మిత్రకు ఇవ్వడం ద్వారా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవచ్చన్నారు. ఎంపిడిఒ బి.మమత మాట్లాడుతూ ప్లాసిక్ సంచులు వాడకాన్ని తగ్గించి గుడ్డ సంచులు ఉపయోగించి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు.ఈ సందర్భంగా క్లాత్ సంచులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ కె.శ్రీనివాస్, కార్యదర్శులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మండపేటను విడదీయొద్దని ర్యాలీ

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లాను ముక్కలు చేసి మండపేటను విడదీయవద్దని డిమాండ్ చేస్తూ అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో గడియారస్తంభం వద్ద ర్యాలీ నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ కోనసీమలో వ్యవసాయం తప్ప పరిశ్రమలు లేని పరిస్థితుల్లో, పరిశ్రమలు ఉన్న మండపేటను తూర్పుగోదావరి జిల్లాలో కలపకూడదని నేతలు తెలిపారు. కోనసీమ రైతులు రోజూ వందలాది లారీలు, ట్రాక్టర్ల ద్వారా ధాన్యాన్ని మండపేట రైస్ మిల్లులకు పంపుతున్నారన్నారు. అనేక రైస్ మిల్స్, బాయిలర్ మిల్స్, కోళ్ల ఫారాలు, ఉపాధి అవకాశాలు మండపేటలోనే ఉన్నాయన్నారు. పరిశ్రమలు ఉన్న మండపేటను వేరు చేయడం అన్యాయమని వారు ప్రభుత్వ దష్టికి తీసుకెళ్లారు. మండపేటను కోనసీమలోనే ఉంచాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ బోణం సత్య వరప్రసాద్, సెక్రటరీ కొమ్మూరి వెంకటా చల ప్రసాద్, గౌరవ కార్యదర్శి కొవ్వూరి వెంకటరెడ్డి, మోకా వెంకట సుబ్బారావు, ద్వారంపూడి సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై కౌన్సిల్ ఆగ్రహం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ సాధారణ నిధుల గల్లంతుపై ఛైర్మన్‌తో పాటు కౌన్సిలర్లు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నగర పంచాయతీ కౌన్సిల్ హాలు నందు ఛైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. తొలుత 8 అంశాలతో కూడిన అజెండా, 10 అంశాలతో కూడిన టేబుల్ అజెండాను ప్రవేశపెట్టి చర్చించారు. ఈ నేపథ్యంలో ఛైర్మన్ ప్రవీణ్ కుమార్ గత ఆరు నెలల కాలంలో మున్సిపాలిటీ ఖాతా నిధుల బుక్ రిజిస్టర్ నిల్వకి, అజెండాలో చూపిన నిల్వకి సుమారు రూ. 10లక్షలు వత్యాసం ఉండటంతో ఛైర్మన్ గట్టిగా నిలదీశారు. ఆ రూ.10 లక్షల నిధులు ఏమైయ్యాయో అధికారులు సమాధానం చెప్పాలంటూ కౌన్సిల్ సభ్యులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ దశలో ఛైర్మన్ కలుగజేసుకుని, రికార్డులను సమావేశానికి రప్పించి, ఆరు నెలలుగా రికార్డులలో నమోదు చేయకపోవడాన్ని సభ్యులకు చూపించారు. అలాగే అజెండా లో చూపించిన రూ. 56 లక్షల నిల్వలకు, సిస్టమ్ ఖాతాలో చూపిస్తున్న రూ.46 లక్షల నిల్వలకు మధ్యన రూ.10 లక్షలు నిధులు వ్యత్యాసం ఉండటంతో రికార్డులన్నింటిని ఛైర్మన్ స్వాధీనం చేసుకుని ఆడిట్ అధికారులకు అప్పగిస్తాం అని చెప్పడంతో కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. తదుపరి 17వ వార్డు కౌన్సిలర్ బొంతు సత్య శ్రీనివాస్ అజెండాలోని 17వ అంశంలో జంగిల్ క్లియరెన్స్ పనులకు కేటాయించిన నిధులకు, అదనంగా సాధారణ నిధులను కేటాయించాలనే తీర్మానంపై చర్చిస్తూ ఇప్పటి వరకు ఎన్ని గంటలకు ఎంత ఎస్టిమేషన్ రూపొందించారు. ఎక్కడెక్కడ ఎన్ని గంటలు యంత్రాలతో పనులు నిర్వహించారో వివరించాలని ఇంజినీరింగ్ అధికారిని నిలదీశారు. ఎఇ శ్రీనివాస్ వివరణనిస్తూ 300 గంటలకి ఎస్టిమేషన్ రూపొందించి, ఇప్పటికి 240 గంటల పనులు పూర్తి చేసి 13 వార్డులలో జంగిల్ క్లియరెన్స్ ప్రక్రియ చేపట్టాగా, ఇంకా 7 వార్డులలో చేయాల్సి ఉందన్నారు. దీనిపై కౌన్సిలర్లు స్పందిస్తూ జంగిల్ క్లియరెన్స్ పనుల సమాచారం తెలపకుండా 10 గంటల పని చేసినా కిలోమీటర్లు పని జరగక పోవడమే కాకుండా, ప్రజాధనం దుర్వినియోగం చేయడమేనని ఆరోపించారు. లైసెన్స్ టౌన్ ప్లానింగ్ ద్వారా ఒక బిల్డింగ్ కి అనుమతి తీసుకుని, పక్కనే మరో బిల్డింగ్ నిర్మాణం చేస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని దుయ్యాబట్టారు. అనంతరం వార్డులలో విధి లైట్లు, శానిటేషన్ సక్రమ నిర్వహణ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సమావేశం తీర్మానించింది. సమావేశానికి వివిధ శాఖల అధికారుల గైర్హాజరుపై సమావేశం ఆగ్రహం వ్యక్తం చేసింది. సమావేశంలో కౌన్సిలర్లు, సచివాలయం సిబ్బంది, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టోస్ ఫ్యాక్టరీ కార్మికుల రక్తదానం

ప్రజాశక్తి - రామచంద్రపురం

పారిశ్రామికవేత్త ఆర్టోస్ ఫ్యాక్టరీ అధినేత అడ్డూరి జగన్నాథవర్మ పుట్టినరోజు సందర్భంగా ఫ్యాక్టరీ కార్మికులు రక్తదానం కార్యక్రమం నిర్వహించారు. తొగరుమూర్తి ఆధ్వర్యంలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు సౌజన్యంతో ఆర్టోస్ ఫ్యాక్టరీ కార్మికులు 19 మంది రక్తదానం చేశారు. మరో 50 మంది అత్యవసర సమయంలో హాస్పిటల్‌కి వచ్చి రక్తదానం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. రక్తదానం అనంతరం రక్తదాతలకు అభినందన సభ ఏర్పాటు చేసి సర్టిఫికెట్లను, బ్లడ్ డోనర్ అవార్డులను అందజేశారు. సమావేశంలో తొగరు మూర్తి, ఫ్యాక్టరీ ఎండి శ్రీ అడ్డూరి సంతోష్ వర్మ, జనరల్ మేనేజర్ మోహన్ రాజు, బ్లడ్ బ్యాంక్ ల్యాబ్ టెక్నీషియన్ చింతపల్లి వాసు, హెచ్‌డిఎఫ్‌సి మేనేజర్ జి.శ్రీనివాస్, ఏరియా హాస్పిటల్ డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - కొత్తపేట

బిళ్ళకుర్రు గ్రామంలో మహాదేవ స్వామి వారి ఆలయ పునర్నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ.1.10 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఆలయ నిర్మాణానికి ఎంఎల్ఎ బండారు సత్యానందరావు శిలాఫలకాన్ని ఆవిష్కరించి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ధర్మాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి శ్రేణులు సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

టిడిపి శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ పార్టీ అభివద్ధి సంక్షేమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేం దుకుకషి చేయాలని సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పిలుపునిచ్చారు. శుక్రవారం రామ చంద్రపురంలోని టిడిదపికార్యాలయంలో పార్టీ శ్రేణులతో జరిగిన నియోజవర్గ స్థాయి సమావేశం లో మాట్లాడారు. త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇప్పటినుంచే సిద్ధంగా ఉండాలన్నారు. నూతనంగా పార్టీలో చేరిన వారిని కలుపుకొని ఐకమత్యంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యకర్తలకు ఏమైనా సమస్యలు ఉంటే ఆయా మండలాల అధ్యక్షులు పరిష్కారానికి కషి చేయాలని, ఆ స్థాయిలో పరిష్కారం గాని సమస్యలు మంత్రి సుభాష్ దష్టికి తీసుకురావాలని సూచించారు. సమావే శంలో టిడిపి నాయకులు గరికపాటి సూర్యనారాయణ, చింతపల్లి వీరభద్రరావు, పట్టణ అధ్యక్షులు ఉండవిల్లి శివ, రూరల్ మండల అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో ఎరుకుల సంఘం నాయకుల సమావేశం

నకిలీ ఎస్‌టి సర్టిఫికెట్లు పొందుతున్న వారిపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి - రామచంద్రపురం

రాజ్యాంగం ఎరుకులకు, గిరిజనులకు ఇచ్చిన రిజర్వేషన్లను కొందరు బిసి కులాలు అడ్డదారిలో నకిలీ సర్టిఫికెట్లు సష్టించి ఎస్‌టి రిజర్వేషన్ కాజేస్తున్నారని ఎరుకల సంఘం నాయకులు అన్నారు. అటువంటి వారిపై వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రామచంద్రపురం లయన్స్ కళ్యాణ్ మండపంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల ఎరుకల సంఘం నాయకుల సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో జిల్లా అధ్యక్షులు మనపూడి రామకృష్ణ, ఉపాధ్యక్షులు అమలదాసు నూకరాజులు మాట్లాడుతూ మా రిజర్వేషన్లు మేము పొందాలంటే ఒకటో తరగతి నుంచి స్కూల్లో చేస్తే పిల్లలకు తప్పనిసరిగా కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు అందజేయాలనే నిబంధన ఏర్పాటుచేయాలన్నారు. తప్పని సరిగా కుల రిజిస్ట్రేషన్ చేయాలని వారు డిమాండ్ చేశారు. నకిలీ ఎస్‌టి సర్టిఫికెట్లు అంద జేస్తున్న అధికారులపైనా తీసుకున్న వారిపైనా ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కింద కేసుల నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఇప్పటికే జిల్లా అధికారులకు, ఆర్‌డిఒలకు వినతి పత్రాలు అందజేశా మని వారు తెలిపారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అందజేసిన రిజర్వేషన్ ఫలాలు ఎస్‌టిలకు అందిం చేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని, ఎస్‌టిల అభివద్ధికి అధికారులు సహకరించి న్యాయం చేయా లని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు మాసగిరి చంద్రరావు, భారతి నాగబాబు, గాడా శివ,అమల దాసు అర్జున్‌రావు, చిట్టిబాబు, కాటమరాజు, లోవరాజు చంద్రరావు, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

30న మోడరన్‌లో మెరిట్ స్కాలర్‌షిప్‌లకు ఎంపికలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని మోడరన్ జూనియర్ కాలేజీలో ఈ నెల30న ఆదివారం టెన్త్ చదువుతున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు మెరిట్ స్కాలర్షిప్స్ ఎంపిక, జరుగుతుందని మోడరన్ విద్యాసంస్థలు అధినేత లయన్ జివి.రావు తెలిపారు. రాబోయే అకాడమిక్ ఇయర్ లో మోడరన్ విద్యాసంస్థల తరపున ప్రతిభావంతులైన విద్యార్థులకు కొన్ని సీట్లు కేటాయించాలని ప్రతిపాదనతో ఈ కార్యక్రమం నిర్వహిస్తు న్నట్లు రావు పేర్కొన్నారు. మెరిట్ స్కాలర్షిప్‌కి ఎంపికైన విద్యార్థులకు జెఇఇ, నీట్, ఇఎపిసెట్, ఓరియెంటేషన్ ఇంటర్ విద్యను ఉచితంగా అందజేస్తామన్నారు. ఇంటర్ ప్రిన్సిపల్ సిహెచ్.రాజేష్ మాట్లాడుతూ ప్రతి అకాడమిక్ ఇయర్ నందు ఇంటర్ ఫలితాలతో పాటు వివిధ పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు ప్రతిభతో జాతీయస్థాయి, రాష్ట్రస్థాయి ఫలితాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. పట్టణ పరిసర ప్రాంతాల టెన్త్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పిఎస్ ప్రకాష్, అకాడమిక్ అడ్వైజర్ సిహెచ్.శ్రీనివాస్, మోడరన్ జూనియర్ కాలేజీ స్టాఫ్ పాల్గొన్నారు.

భూ సమస్యలను గుర్తించేందుకే గ్రామసభలు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండల గ్రామాల్లో భూ సమస్యలు గుర్తించేందుకై రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ జి.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన మండంలోని గ్రామసభల షెడ్యూల్‌ను వెల్లడించారు. ఈ అవకాశాన్ని రైతులు సదినియాగం చేసుకోవాలని ఆయన కోరారు.

వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక డంప్‌యార్డ్ నందు వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక పురపాలక సంఘ డంపింగ్ యార్డ్ వద్ద చెత్తను ప్రాసెసింగ్ చేసేందుకు ప్లాస్మా గ్రూపు కాంట్రాక్టర్ ముందుకు వచ్చారని వెల్లడిం చారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.మాధవి, మునిసిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూజా కార్యక్రమాలు

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక యర్రమిల్లి వారి వీధిలో 40వ హనుమత్ వ్రత పూజా మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాలు డిసెంబర్ 2వ తేదీ వరకు నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. 2న హనుమత్ వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు.

మహారాజశ్రీ యలమంచిలి ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.No. 331 / 2023

బిట్వీన్:
మలపరెడ్డి శ్రీనివాసులు . . . వాది
అండ్:
లమ్మత ఫాల్గుణరావు . . . ప్రతివాది
టు:
ప్రతివాది:
లమ్మత ఫాల్గుణరావు, తండ్రి ధర్మారావు
సాకేను డో.నెం. 104-3-294, 2వ వీధి, గణేష్ గుడి ఎదురుగా, గణేషనగర్, శ్రీచైతన్య స్కూల్ వద్ద, మోరంపాడు రాజమండ్రి-533107.

దావా పరిహారం నిమిత్తం మీ మీద పైన వివరించిన వాజ్యము వాది తెప్పించినందు వల్ల సదరు దావాకు ప్రత్యుత్తరము చెప్పగా అందువలన **2025వ సం॥ 12వ నెల 18వ తారీఖున పగలు 10-30 గంటలకు** స్వతహాగా లేక సరి అయిన భోగట్టా యివ్వబడిన వకీలు గారి ద్వారాగా లేక సరిఅయిన ఏజంటు మూలముగా ఈ కోర్టులో హాజరయ్యేటట్లు యిందువలన మీకు ఆజ్ఞాపించడమైనది. మీ ప్రతివాదమునకు ఆధారముగా వుద్దేశించి యుండే దస్తావేజులన్నింటిని నీ యొక్క స్టేట్‌మెంటుతో సహా ఆరోజున హాజరు పరచుటకు మీకు ఉత్తరువు చేయడమైనది. పైన చెప్పబడిన దినమందు మీరు హాజరు కాకుండా తప్పిపోయిన యెడల మీ పరోక్ష మందు పై వాజ్యమును విమర్శన చేసి తీర్మానించుటమగునని, మీరు తెలుసుకోవలసినది.

(శ్రీకోర్టు వారి ఉత్తరువుతో)

వాడపల్లి అన్నపూర్ణయ్య
అడ్వకేట్, యలమంచిలి
అనకాపల్లి జిల్లా.
యలమంచిలి
తే:28-11-2025 సెల్: 9247159149

మహారాజశ్రీ రాజమహేంద్రవరం గౌరవనీయులైన ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఎస్.ఓ.పి.నెం.12/2025

పార్టీలు:-
1. కొత్తపల్లి సావిత్రి
2. కొత్తపల్లి లక్ష్మి
3: బుద్ధాల ఉషారాణి ...పిటీషనర్లు

మరియు

1. మెసర్స్ కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, (పూర్వం కోరమండల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్), రిప్రజెంటెడ్ బై మేనేజర్, కోరమాండల్ హౌస్, డోరునెం.1-2-10, సర్దార్ పటేల్ రోడ్డు, సికింద్రాబాద్, తెలంగాణ రాష్ట్రం.
2. గుండా గజ లక్ష్మి, (భర్త) అప్పారావు, హిందువు, వయస్సు63సం॥లు, గృహిణి, ఫ్లాటు నెం.107, సాగర్ రెసిడెన్సీ, ఎ.పి.హెచ్.బి, కోలనీ, మౌలాలి, కుషాయిగుడా, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం,
3. కొత్తపల్లి సత్యనారాయణ, (తండ్రి) (లేటు) గెరటయ్య, హిందువు, వయస్సు61సం॥లు, రిటైర్డ్ ఉద్యోగి, ఫ్లాటు నెం.101, వనస్పతి బ్లాకు, చెంద్రిక విలాస్ అపార్టుమెంటు, శ్రీరామపురం గ్రామం, రాజానగరం మండలం, తూర్పు గోదావరి జిల్లా.
4. కొత్తపల్లి వెంకట రమణ, (తండ్రి) (లేటు) గెరటయ్య, హిందువు, వయస్సు57సం॥లు, ఉద్యోగి, డోరు నెం.2-42/301, దొర అపార్టుమెంటు, ప్రకాశం వీధి, అల్కట్ గార్డెన్స్, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరిజిల్లా ...రెస్పాండెంట్లు

పై పిటీషనర్లు యిందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, పై గ్రంథంలో చనిపోయిన కొత్తపల్లి గెరటయ్య గారి తాలూకు షేర్ సర్టిఫికెట్లుకు పై పిటీషనర్లు వారసులు అని సక్సేషన్ సర్టిఫికెట్ మంజూరు నిమిత్తం దాఖలు చేసిన పై పిటీషను **ది.29-12-2025వ** తేదీ కు పై కోర్టులో వాయిదా అయి వున్నది. కావున పై నెంబరు పిటీషనులో ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్న యెడల పై కోర్టు ఎదుట **ది.29-12-2025వ** తేదీ ఉదయం **గం॥10.30 ని॥లకు** స్వయముగా గాని, ప్లీడర్ గారి ద్వారా గాని హాజరై తమ అభ్యంత రములు తెలియపర్చుకోగలరు. లేని యెడల పై పిటీషను పరోక్షమున నిర్ధారింపబడును.

యమ్.ఆర్.సత్యసాయి(రాంబాబు)
పిటిషనర్ తరపున అడ్వకేట్
డోర్.నెం.86-11-11/1
రాజమండ్రి వాడ్రేవునగర్,తిలక్‌రోడ్
ది.27-11-2025 రాజమండ్రి

ప్రకటన

In the Court of the Hon'ble Principal Civil Judge (Senior Division) at Rajamahendravaram

S.O.P.No. 10/2025

Between:
Iduru Gayathri Devi - Petitioner
and
Bula Venkata Ramana - Respondent

పైన తెలిపిన పిటీషనర్, (లేటు) హైమావతి గారి చెల్లెలు మరియు రెస్పాండెంట్ (లేటు) హైమావతి గారికి భర్త (లేటు) హైమావతి గారు డైట్ కాలేజ్, బొమ్మూరు రాజమండ్రి నందు పనిచేసేవారు ఆమె అప్పుడు 40,000 వేలు రూపాయలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దవళేశ్వరం బ్రాంచ్, రాజమండ్రి నందు డిపాజిట్ చేసియున్నారు మరియు పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ నందు లక్ష రూపాయలు (రూ. 1,00,000) పాలసీ తీసుకొనియున్నారు. (లేటు) హైమావతి గారు తన భర్తను (రెస్పాండెంట్) అక్టోబర్ 2016 సంవత్సరము వదిలిపెట్టి వెళ్ళిపోయినారు. ఈ విషయం పై కడియం పోలీస్ స్టేషన్, రాజమండ్రి రూరల్ నందు ఉమెన్ మిస్సింగ్ కేస్ నమోదు చేసినారు. సదరు పోలీస్ వారు ది. 11-07-2024 నందు final report file చేస్తు సదరు హైమావతి గారు చట్టప్రకారం చనిపోయినట్లుగా నిర్ధారించారు. రెవెన్యూ శాఖ ది. 28-08-2024 హైమావతి చనిపోయినట్లు Death Certificate మంజూరు చేసినారు. ఆ తరువాత హైమావతి గారి భర్త (రెస్పాండెంట్) వెంకట రమణ గారు పిటీషనర్ గారి కుటుంబముతో సంబంధము లేకుండా జీవించుచున్నారు. మరియు (లేటు) హైమావతి వారి భర్త (రెస్పాండెంట్) వెంకటరమణ గారికి వారి వైవాహిక జీవితంలో పిల్లలు కలుగలేదు. ది. 11-06-2024 బుల్లా వెంకట రమణ (రెస్పాండెంట్) అయిన తన భార్య (లేటు) హైమావతి గారికి సంబంధించిన స్థిర, చరాస్తులు మరియు ఇన్సూరెన్స్ క్లైయిమ్స్, బ్యాంక్ డిపాజిట్స్ తన హక్కులు వదులుకొని ఒక బాండ్ రూపంలో వ్రాయించి నోటరీ చేసి పిటీషనర్‌కి అందించారు. కావున ఇట్టి స్థితిలో పైన తెలిపినటువంటి బ్యాంక్ డిపాజిట్ (40,000) మరియు పోస్టల్ ఇన్సూరెన్స్ క్లైయిమ్ (1,00,000) వెరశి (1,40,000) ఒక లక్ష నలభైవేలు రాబట్టుకొనుటకు ది. 23-10-2025న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్, రాజమండ్రి యందు ఎస్.ఓ.పి.నెం: 10/2025 పిటీషనర్ దావా దాఖలు చేసియున్నారు. (లేటు) హైమావతి గారి వారసురాలుగా పిటీషనర్ గాయత్రి గారు, రెస్పాండెంట్ బి. వెంకట రమణ పైన పై దావా Succession Certificate నిమిత్తము ఎస్.ఓ.పి.నెం: 10/2025 దాఖలు చేయగా కోర్ట్ వారు ది. 09-12-2025కి వాయిదా వేసియున్నారు. సదరు పిటీషన్‌పై ఎవరికైనను అభ్యంతరములు ఉన్న యెడల సదరు పై కోర్ట్‌లో తెలుపు కొనగలరు. లేని యెడలపై పిటీషన్ కోర్ట్ వారు విచారించిపై పిటీషనర్‌ని వారసురాలిగా ప్రకటించగలరని తెలియజేయు చున్నాము.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)

ఇట్లు

దివి వరప్రసాద్, అడ్వకేట్
డో.నెం. 21-16-17, పప్పులమిల్లు
ఎదురుగా, మధురానగర్, విజయవాడ-11.
సెల్: 9866204872
వాయిదా తేది: 09-12-2025